వాల్మీకి జీవితం ఆదర్శం


మాట్లాడుతున్న ఎంపీ కడియం కావ్య, చిత్రంలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

మడికొండ, న్యూస్‌టుడే: మార్పుతో మనిషి ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చుని నిరూపించిన మహనీయుడు వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శమని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. కాజీపేట మండలం మడికొండలో వాల్మీకి జయంతి స్వర్ణోత్సవాలను గురువారం రాత్రి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుతో కలిసి ఆమె ప్రారంభించారు. బోయ వాల్మీకి సంఘం గ్రామ అధ్యక్షుడు బోగి లింగమూర్తి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ మాట్లాడారు. వాల్మీకి చరిత్రను భవిష్యత్తు తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. బోయలను ఎస్టీ జాబితాలో చేర్చడానికి రాష్ట్రంలోని ఎంపీలందరితో తీర్మాన లేఖను సంఘం నాయకులు తీసుకుని వస్తే వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ప్రస్తావిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ వాల్మీకి ఆలయానికి స్థలాన్ని ఇవ్వడానికి కలెక్టర్‌తో మాట్లాడి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి దృష్టికి తీసుకెళ్లి మంజూరు లేఖ ఇప్పించే బాధ్యత తనదన్నారు. కార్యక్రమంలో బోయ ఐక్య వాల్మీకి సంఘం రాష్ట్ర నాయకులు బోగి కృష్ణమూర్తి, కెంగర్ల మల్లయ్య, నిగ్గుల వెంకటప్రసాద్, మురికి వెంకన్న, మెట్టుగుట్ట ఛైర్మన్ రఘు, మాజీ ఛైర్మన్ కుర్ల మోహన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు బైరి లింగం తదితరులు పాల్గొన్నారు.

కిలోల్లో కొంటున్నారు
టన్నుల్లో తరలిస్తున్నారు!

జోరుగా రేషన్ బియ్యం దందా..

ఈనాడు, మహబూబాబాద్, న్యూస్‌టుడే, నర్సంపేట, కమలాపూర్, వరంగల్ క్రైం



ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రేషన్ దందా జోరుగా సాగుతోంది. పట్టణాలు, గ్రామాల్లోనే కాకుండా ఏజెన్సీ ప్రాంతాలకూ ఇది విస్తరించింది..

ఉమ్మడి జిల్లా పరిధిలోని 11,11,401 కార్డుదారులకు ప్రతి నెలా 2,266 చౌకధరల దుకాణాల ద్వారా సుమారు 23 వేల టన్నుల బియ్యం పంపిణీ జరుగుతోంది. ఇందులో 2,250 టన్నులకుపైగా పక్క దారి పడుతోంది.



ఎలా చేస్తారంటే..

పేదల బియ్యంతో రూ.లక్షలు సంపాదిస్తున్న అక్రమార్కులు, మిల్లర్లు.. పోలీసులకు చిక్కకుండా రకరకాల ఎత్తులు వేస్తున్నారు. రేషన్ దుకాణాలు, లబ్ధిదారుల నుంచి సేకరించిన రాయితీ బియ్యాన్ని టన్నుల కొద్దీ నిల్వ చేస్తారు. అర్ధరాత్రి లారీల్లో మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌కు తరలిస్తారు.


ఇది 30 టన్నుల రాయితీ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న లారీ. ఇటీవల మహారాష్ట్ర వైపు వెళ్తుండగా మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి వద్ద పోలీసులు పట్టుకున్నారు. వాహనాన్ని పౌరసరఫరాలశాఖ అధికారులకు అప్పగించారు.

టాస్క్‌ఫోర్స్

1 రేషన్ దుకాణాల ద్వారా..

లబ్ధిదారులు తమ కార్డును కోల్పోకుండా ఉండేందుకు ప్రతి నెలా చౌకధరల దుకాణం వద్దకు వెళ్లి రేషన్ తీసుకుంటున్నట్లు వేలిముద్రలు వేసి వస్తున్నారు. దుకాణాదారుడు వారికి కిలోకు రూ.10 చొప్పున లెక్క కట్టి డబ్బులు ఇస్తున్నారు. మహబూబాబాద్, వరంగల్ జిల్లాలో కొందరు డీలర్లు లబ్ధిదారులకు డబ్బులకు బదులు సబ్బులు, సర్ఫ్, గోధుమ పిండి, బొళ్ల సబ్బులు అందజేస్తున్నారు. అలా పోగైన బియ్యాన్ని మిల్లర్లకు రూ.14 నుంచి రూ.16 చొప్పున రాత్రి సమయంలో మిల్లులకు తరలిస్తున్నారు.

2 సన్నబియ్యంగా మార్చి

రేషన్ దుకాణాలతో పాటు ఇంటింటా కొనుగోలు చేసిన రేషన్ బియ్యాన్ని మిల్లర్లు తమ రైస్ మిల్లుల్లో సన్నబియ్యంగా మార్చుతున్నారు. అలా మరపట్టిన బియ్యాన్ని 25 కిలోల సంచుల్లో నింపి బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.50 నుంచి రూ.60 మధ్య విక్రయిస్తున్నారు.

3 నూకలుగా..

పౌల్ట్రీఫారాలు, బీర్ల తయారీ కంపెనీల్లో నూకల వినియోగం పెరిగింది. దీంతో వాటికి డిమాండ్ అధికమైంది. దళారులు లబ్ధిదారుల నుంచి రూ.8 నుంచి రూ.10 చొప్పున కొనుగోలు చేసిన బియ్యాన్ని మిల్లర్లకు రూ. 12 నుంచి రూ.14 చొప్పున విక్రయిస్తున్నారు. నూకలుగా మరపట్టిన మిల్లర్లు కిలోకు రూ. 18 లేదా రూ.20 చొప్పున అవసరమున్న ప్రాంతాలకు తరలిస్తున్నారు. ● వరంగల్ జిల్లా నర్సంపేట డివిజన్, మహబూబాబాద్ జిల్లా మహబూబాబాద్ డివిజన్‌లో కొందరు అక్రమార్కులు సామర్థ్యం తక్కువ కలిగిన మిల్లులను స్థాపించుకుని బియ్యాన్ని నూకలుగా మరపడుతున్నారు.

మాఫియాలా బియ్యం డాన్‌లు

ఉమ్మడి జిల్లాలో చౌక బియ్యం మాఫియా విస్తరిస్తోంది. జిల్లాకు ఇద్దరు నుంచి నలుగురు చొప్పున దందా చేస్తూ బియ్యం డాన్‌లుగా ఎదిగారు. యువత, మైనర్లు పావులుగా మారుతున్నారు. దళారులకు ద్విచక్రవాహనం, సంచులు, డిజిటల్ కాంటాలు అప్పగించి ఊళ్లలోకి పంపిస్తున్నారు. వారు ఇంటింటా తిరుగుతూ కిలోకు రూ.8 నుంచి రూ.10 చొప్పున రేషన్ బియ్యం కొంటారు. డిజిటల్ కాంటాలపై తూకాలు చేస్తున్నారు. బస్తా బరువు 50 కిలోలు కాగానే వాహనంపై తమ రహస్య ప్రదేశానికి తరలిస్తారు. ఇందుకోసం అక్రమార్కులు పెద్ద నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకున్నారు.


వరంగల్ జిల్లా నర్సంపేట డివిజన్ పరిధిలో లబ్ధిదారుల నుంచి అక్రమంగా బియ్యం కొనుగోలు చేసి బస్తా 50 కిలోలు కాగానే స్కూటీపై తీసుకెళ్తున్న యువకులు

● వరంగల్ జిల్లా నర్సంపేట డివిజన్‌లో ఒక వ్యక్తి చక్రం తిప్పుతున్నారు. పోలీసు, రెవెన్యూ, పౌరసరఫరాలశాఖ అధికారులను మచ్చిక చేసుకొని ఆ ప్రాంతంలో దందాను కొనసాగించే ఇతరులను పట్టిస్తున్నారు. తాను మాత్రం యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. ప్రతి రోజు 15 నుంచి 20 క్వింటాళ్ల చొప్పున ప్రయాణికుల ఆటోల్లో నల్లబెల్లి, చెన్నారావుపేట, పర్వతగిరి మండలాల్లోని మిల్లులకు తరలిస్తున్నారు.

● హనుమకొండ జిల్లాలో బడా దళారీ అక్రమానికి అడ్డూ అదుపు లేదు. మండలాల వారీగా మధ్యదళారీ వ్యవస్థను ఏర్పాటు చేసుకుని రూ.కోట్లు గడిస్తున్నారు.

సీఎంఆర్ లక్ష్యం కోసం..

వరంగల్ జిల్లా నల్లబెల్లి, దుగ్గొండి, పర్వతగిరి, మహబూబాబాద్ జిల్లా గూడూరు, కేసముద్రం, మరిపెడ, హనుమకొండ జిల్లా కమలాపూర్ తదితర మండలాల్లోని మిల్లర్లే చౌక బియ్యంతో వ్యాపారం చేస్తున్నారు. ఏటా ధాన్యం కొనుగోలు సమయంలో వారికి కేటాయించిన ధాన్యాన్ని అధిక ధరలకు పక్కదారి పట్టిస్తున్నారు. సీఎంఆర్ లక్ష్యాన్ని భర్తీ చేసుకునేందుకు తక్కువ ధరకు లభించే పేదల బియ్యాన్ని టన్నుల కొద్ది కొనుగోలు చేస్తున్నారు. వాటిని రీసైక్లింగ్ చేసి సీఎంఆర్ కింద లెక్కలు చూపిస్తున్నారు. ఇదంతా సంబంధిత అధికారుల కనుసన్నల్లోనే జరుగుతోంది.

ఇదీ పరిస్థితి..



హనుమకొండ జిల్లా పరకాలలోని శ్రవణ్‌కుమార్ బిన్ని రైస్‌మిల్లరు రాయితీ బియ్యాన్ని రీసైక్లింగ్ చేస్తూ పౌరసరఫరాలశాఖకు సరఫరా చేస్తున్నట్లు సమాచారం అందడంతో బుధవారం పోలీసులు మిల్లుపై దాడి చేశారు. అందులో రూ.12.81 లక్షల విలువ చేసే 325 క్వింటాళ్ల రాయితీ బియ్యాన్ని, 187.5 క్వింటాళ్ల నూకలను స్వాధీనం చేసుకున్నారు.

అంగట్లో సరకులా..
వ్యాపార అనుమతి

కార్పొరేషన్, న్యూస్‌టుడే


వరంగల్ 25 డివిజన్‌లో ట్రేడ్ లైసెన్సు రుసుం వసూలు చేస్తున్న ఉద్యోగులు

పైసలిచ్చుకో.. ట్రేడ్ లైసెన్సులు తీసుకో.. అనే విధంగా ఉంది గ్రేటర్ వరంగల్ ప్రజారోగ్య విభాగం తీరు. డబ్బులకు కక్కుర్తి పడి నకిలీ వ్యాపార సంస్థలకు అడ్డగోలుగా అనుమతి జారీ చేస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకు రుణాల కోసం కొందరు కాగితాల్లోనే దుకాణాలు, ఇతర వ్యాపారులు సృష్టిస్తున్నారు. బ్యాంకు రుణం పొందగానే తాత్కాలిక బోర్డులు, ఫ్లెక్సీలు తొలగిస్తున్నారు. 'వన్ టైం ట్రేడ్' లైసెన్సులతో గ్రేటర్ వరంగల్‌లో బకాయిలు పేరుకుపోతున్నాయి. నాలుగేళ్ల క్రితం వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి సుమారు 6-7 వేల నకిలీ వ్యాపార అనుమతులు(ట్రేడ్ లైసెన్సులు) రద్దు చేశారు. సుమారు రూ.5-6 కోట్ల పాత బకాయిలు రద్దయ్యాయి. ఈ విషయం తెలిసి కూడా ప్రజారోగ్య విభాగం శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు నకిలీ వ్యాపారులకు కొత్తగా అనుమతి జారీ చేశారు. ఒక్కొక్కరి నుంచి రూ.5-8 వేల వరకు వసూలు చేశారని తెలిసింది.

వసూళ్లపై అశ్రద్ధ

ట్రేడ్ లైసెన్సు వసూళ్లపై శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు అశ్రద్ధ వహిస్తున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ట్రేడ్ లైసెన్సు రుసుం వసూళ్ల లక్ష్యం రూ.12.77 కోట్లు కాగా, రూ.3.19 కోట్లు రాబట్టారు. ఇంకా రూ.9 కోట్ల బకాయిలున్నాయి. అందులో పాత బకాయిలు రూ.3.05 కోట్లు, కొత్తవి రూ.6 కోట్ల వరకు ఉంటాయి.

ప్రత్యేక దృష్టి సారించాం

- డాక్టర్ రాజిరెడ్డి, ముఖ్య ఆరోగ్యాధికారి, గ్రేటర్ వరంగల్

ట్రేడ్ లైసెన్సు వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాం. పాతవి, కొత్త బకాయిలు నగరంలోని 66 డివిజన్ల వారీగా సిద్ధం చేసి జవాన్లకు పంపించాం. నిబంధనల ప్రకారం ట్రేడ్ లైసెన్సులు జారీ చేయాలని ఆదేశించాం.

32,765 మంది వ్యాపారులు

- గ్రేటర్ వరంగల్ ప్రజారోగ్య విభాగం అధికారిక లెక్కల ప్రకారం 32,765 మంది వ్యాపారాలు ఉన్నారు. కాజీపేట సర్కిల్‌లో 17,983, కాశీబుగ్గ సర్కిల్‌లో 14,782 వ్యాపారాలకు అనుమతి ఉంది. రెండు, మూడేళ్లుగా 8-9 వేల మంది వ్యాపారులు రుసుం చెల్లించడం లేదు. నగరంలోని 66 డివిజన్లలో పరిశీలించినా దుకాణాల జాడ దొరకడం లేదు.
- పాత బకాయిలు రూ.3.05 కోట్లు ఉన్నాయి. కాశీబుగ్గ సర్కిల్‌లో రూ.1.09 కోట్ల పాత బకాయిలుంటే రూ.9.65 లక్షలు వసూలయ్యాయి. కాజీపేట సర్కిల్‌లో రూ.1.96 కోట్లు ఉండగా, కేవలం రూ.7.65 లక్షలు వసూలు చేశారు.
- కాజీపేట, హనుమకొండ ప్రాంతాల్లోనే అత్యధికంగా నకిలీ వ్యాపార సంస్థలు ఉన్నాయని తెలిసింది. కాశీబుగ్గ సర్కిల్‌లో కొన్ని డివిజన్లలో తప్పుడు ఇంటి నంబర్లు చూపించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు ఒక్కటై కమీషన్లకు ఆశపడి నిబంధనలకు విరుద్ధంగా ట్రేడ్ లైసెన్సులు ఇచ్చారు.
- కరీమాబాద్ వార్డు కార్యాలయం పరిధిలో ఓ ప్రైవేటు జవాన్ లైసెన్సులు ఇప్పిస్తానని చెప్పి రూ.2 లక్షలు వసూలు చేశారు. గతంలో తొలగించిన జవాన్‌ను మళ్లీ విధుల్లోకి తీసుకున్నారు.

హనుమకొండ ఏసీపీకి అతి ఉత్కృష్ట సేవా పతకం


కె.దేవేందర్‌రెడ్డి

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: పోలీసు శాఖలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన అధికారులకు ఇచ్చే ఉత్కృష్ట, అతి ఉత్కృష్ట సేవా పతకాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్ర వ్యాప్తంగా 410 మందిని ఎంపిక చేసింది. హనుమకొండ ఏసీపీ కె.దేవేందర్‌రెడ్డికి అతి ఉత్కృష్ట పతకం లభించింది. కరీంనగర్ జిల్లాకు చెందిన ఈయన 1996లో ఆర్ఎస్సైగా ఉద్యోగంలో చేరారు. తర్వాత సివిల్ ఎస్సైగా కన్వర్షన్ అయ్యారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు ఠాణాల్లో ఎస్సై, సీఐగా విధులు నిర్వర్తించారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో సమర్థంగా విధులు నిర్వర్తించి, ఉన్నతాధికారుల ప్రశంసలు పొందారు. పోలీస్‌శాఖలో పలు పతకాలు అందుకున్న దేవేందర్‌రెడ్డి తాజాగా అతి ఉత్కృష్ట అవార్డుకు ఎంపిక కావడంతో పలువురు పోలీస్ అధికారులు అభినందించారు.

పార్కుల్లో విండ్రో కంపోస్టు యూనిట్లు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లోని ప్రతి పార్కులో విండ్రో కంపోస్టు యూనిట్లు, వర్మీ కంపోస్టు షెడ్లు ఏర్పాటు చేయాలని గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం ఇంజినీరింగ్, ఉద్యాన విభాగాల అధికారులు, ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. పార్కుల్లో వెలువడే వ్యర్థాలు శుద్ధి చేసేందుకు విండ్రో, వర్మీ కంపోస్టు యూనిట్లు ఉపయోగపడతాయని మేయర్ తెలిపారు. పార్కుల నిర్వహణను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో ఎస్ఈ రాజయ్య, హెచ్ఓ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.


కేయూలో చెట్ల తొలగింపుపై విచారణ

విద్యానగర్, న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయం అభివృద్ధి విభాగం ఆధ్వర్యంలో చేపడుతున్న పలు పనుల నేపథ్యంలో చెట్ల నరికివేత, కర్ర తరలింపుపై అటవీశాఖ అధికారులు దృష్టి సారించారు. వర్సిటీ అధికారులు అటవీశాఖ నుంచి 39 చెట్ల తొలగింపు కోసం అనుమతి తీసుకొని సుమారు 60 చెట్లు నరికినట్లు తెలియడంతో అటవీశాఖ అధికారులు అప్రమత్తం అయ్యారు. గురువారం కర్రను తరలిస్తున్న రెండు వాహనాలను సీజ్ చేసినట్లు సమాచారం. శుక్రవారం అటవీశాఖ రేంజ్ అధికారి భిక్షపతి ఆధ్వర్యంలో విచారణ చేపట్టనున్నారు.

మస్తుగా తాగేశారు..!

● 14 రోజుల్లో రూ.142.79 కోట్ల మద్యం విక్రయాలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో దసరా సందర్భంగా మద్యం విక్రయాలు రాష్ట్రంలోనే రికార్డును సాధించాయి. రాష్ట్రంలోనే అధిక పెరుగుదల నమోదైంది. వరంగల్ పట్టణ, రూరల్ పరిధిలో 49.88, జనగామ జిల్లాలో 89.87 శాతం విక్రయాలు పెరిగాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 294 వైన్స్, 134 బార్ అండ్ రెస్టారెంట్లు ఉన్నాయి. గతేడాది పండగ సందర్భంగా రూ.95.53 కోట్ల అమ్మకాలు జరిగితే.. ఈసారి అదే 14 రోజుల్లోనే రూ.142.76 కోట్లకు చేరడం గమనార్హం. దాదాపు రూ.48.26 కోట్లు ఎక్కువగా జరిగాయి. ఈ నెల చివర్లో దీపావళి ఉండటంతో విక్రయాలు మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు ఆబ్కారీశాఖ అధికారులు భావిస్తున్నారు. – వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే



ఇవీ కారణాలు..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మద్యం విక్రయాలు ఎక్కువగా పెరగడానికి పలు కారణాలు ఉన్నాయి. అందులో ప్రధానమైనది గొలుసు దుకాణాలు. గ్రామగ్రామాన కిరాణ దుకాణాలు, ఇళ్లల్లోనూ విక్రయిస్తున్నారు. సమయపాలన పాటించకుండా అవి తెరిచే ఉంటున్నాయి. కొన్ని ప్రాంతాల్లో 24 గంటలు అది దొరుకుతోంది. గ్రామీణ ప్రాంతాలతో పాటు నగర శివారులో గొలుసు దుకాణాలు ఎక్కువగా ఉండటంతో వారు వైన్స్‌ల నుంచి మద్యం తీసుకొని అధిక ధరలకు విక్రయిస్తున్నారు. వరంగల్ నగరంలో ఎక్కువ విద్యా సంస్థలు ఉంటాయి. యువత ఎక్కువగా కొనుగోలు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. విద్యార్థులు, పిల్లలకు విక్రయించలేదని చెప్పారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రక్రియలో వేగం పెంచండి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రక్రియలో ఏర్పాటు చేసిన అధికారుల బృందాలు వేగవంతంగా పరిశీలన పూర్తి చేయాలని కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో గ్రేటర్ వరంగల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రక్రియపై కలెక్టర్ సమీక్షించారు. చెరువులు, కుంటలు ఉన్నచోట రెవెన్యూ, సాగునీటి పారుదల శాఖల అధికారులు ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలనలో పాల్గొనాలన్నారు. కుడా ఆధ్వర్యంలో ఎల్కతుర్తి మండల కేంద్రంలో కూడలి అభివృద్ధి, సుందరీకరణ పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో వెంకటేష్, కుడా పీవో అజిత్‌రెడ్డి, డీపీవో లక్ష్మీరమాకాంత్, ఎల్ఆర్ఎస్ నోడల్ అధికారి శంకర్‌కుమార్, నగరపాలక సంస్థ సీపీవో రవీందర్, ఈఈ రాజయ్య పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి..

హనుమకొండ కలెక్టరేట్ : జిల్లాలోని ప్రతి మండల కేంద్రంలో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో డీఆర్‌డీఏ, మెప్మా, సహకార శాఖ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు నిర్వాహకులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సన్న, దొడ్డు రకం ధాన్యం వివరాలు పరీక్షించుకొని సరిగ్గా నమోదు చేయాలన్నారు. అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఎస్‌వో ఉమారాణి, వ్యవసాయ శాఖ అధికారి రవీందర్‌సింగ్, పౌరసరఫరాల శాఖ డీఎం మహేందర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

19న ఉచిత వైద్య శిబిరం


వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది కోసం ఈ నెల 19న వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సీపీ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. ఉదయం 9 గంటలకు భీమారంలోని శుభం పోలీసు కళ్యాణ వేదికలో మెడికవర్ ఆసుపత్రికి చెందిన వైద్య నిపుణులు, శరత్ కంటి ఆసుపత్రి వైద్యులు వైద్య పరీక్షలు చేస్తారన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది, హోంగార్డు కుటుంబ సభ్యులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బాణసంచా విక్రయాలకు దరఖాస్తు చేసుకోండి

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: దీపావళి సందర్భంగా తాత్కాలిక బాణసంచా విక్రయాలకు దుకాణాల ఏర్పాటు కోసం దరఖాస్తు చేసుకోవాలని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. అగ్నిమాపక శాఖ జారీ చేసిన ఎన్‌వోసీ, ప్రైవేటు స్థలాల్లో ఏర్పాటు చేసే వారైతే స్థలం యజమాని, ప్రభుత్వ స్థలమైతే అధికారుల అనుమతి పత్రాలను, భవనాల్లో ఏర్పాటు చేస్తే పక్కింటి యజమాని అనుమతి పత్రం దరఖాస్తుకు జతచేయాల్సి ఉంటుందన్నారు. భవన బ్లూప్రింట్‌తో పాటు ఎస్‌బీఐ అదాలత్ బ్రాంచ్‌లో రూ.800 చలాన్ ప్రభుత్వ ఖజానా పేరుతో తీయాలని చెప్పారు. పూర్తి చేసిన దరఖాస్తును ఈ నెల 23లోపు సంబంధిత అధికారులకు అందజేయాలని సూచించారు. వాటిని పరిశీలించిన తర్వాత దుకాణాల ఏర్పాటుకు అనుమతి ఇస్తారన్నారు.

వానమ్మా.. వందనం!

ముగిసిన నైరుతి.. మురిసిన ఓరుగల్లు



– న్యూస్‌టుడే, వరంగల్ వ్యవసాయం

ఉమ్మడి వరంగల్ జిల్లాకు వానాకాలం కలిసి వచ్చింది. సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదు కావడంతో చెరువులు, కుంటలు నిండాయి. భూగర్భ జలాలు పెరిగాయి. అన్నదాతలు అప్పుడే యాసంగి సాగుకు సన్నద్ధం అవుతున్నారు. జూన్‌లో మొదలైన నైరుతి సీజన్ సెప్టెంబరుతో ముగిసినా అక్టోబరు రెండో వారం వరకు అడపా దడపా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి.

మండలాలవారీగా అధిక వర్షపాతం శాతం

మండలం	శాతం
మహబూబాబాద్	
చిన్న గూడురు	117
మరిపెడ	100
నర్సింహులపేట	96
నెల్లికుదురు	60
దంతాలపల్లి	57
మహబూబాబాద్	44
కురవి	42
ములుగు	
ఏటూరునాగారం	101
మంగపేట	47
వెంకటాపురం	40
తాడ్వాయి	37
గోవిందరావుపేట	36
జనగామ	
కొడకండ్ల	50
జనగామ	24
భూపాలపల్లి	
మల్హార్‌రావు	30
కాటారం	28
రేగొండ	23
మహదేవ్‌పూర్	23
వరంగల్	
దుగ్గొండి	42
వర్ధన్నపేట	41
పర్వతగిరి	34
హనుమకొండ	
భీమదేవరపల్లి	34
ధర్మసాగర్	28
ఎల్కతుర్తి	24

సాగుబడికి చెరువుల నీరు

ఇది హసన్‌పర్తి మండలం నాగారం చెరువు. ఉమ్మడి జిల్లాలో 3,900 చెరువులు, కుంటలున్నాయి. ఈసారి 65 శాతం పూర్తి స్థాయిలో నిండాయి. మిగతావాటిలో 50 నుంచి 75 శాతం వరకు నీరు చేరింది. వీటికింద 4,500 ఎకరాలకు సాగునీరు అందుతుంది.



జిల్లాల వారీగా జూన్ నుంచి సెప్టెంబరు వరకు వర్షపాతం (మి.మీ.)

జిల్లా	సాధారణం	నమోదైంది
ములుగు	1200	1603.8
మహబూబాబాద్	878.0	1280.5
జయశంకర్	985.8	1159.8
వరంగల్	901.0	1082.5
హనుమకొండ	875.7	981.5
జనగామ	755.2	829.2

పంటలకు మేలు

- తోకల ఆదిరెడ్డి, రైతు, సీతంపేట, హసన్‌పర్తి



ఈసారి సకాలంలో వర్షాలు పడ్డాయి. యాసంగిలో పంటలు సాగు చేసుకునేందుకు అవకాశం ఏర్పడింది. చెరువులతో పాటు ఎస్సారెస్పీ కాలువల ద్వారా వరి పంటకు నీరందించే అవకాశం ఉన్నందున యాసంగి సాగుపై ఆశలు పెంచుకున్నాం.

సాగు విస్తీర్ణం పెరుగుతుంది

- రవీంద్రసింగ్, హనుమకొండ జిల్లా వ్యవసాయాధికారి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వానాకాలంలో ఆశించిన మేరకు వర్షాలు కురిశాయి. దీంతో జలశయాల్లోకి వరదనీరు చేరింది. నీరు లేని చెరువుల్లోకి ఎస్సారెస్పీ కాలువల ద్వారా నింపుతారు. ఈసారి సాగు విస్తీర్ణం పెరుగుతుంది.



పంటలకు నీరు అందిస్తున్న రైతు




ధర్మసాగర్ మండలం పెద్దపెండ్యాలలో నిండుగా వ్యవసాయ బావి

రైతులకు మద్దతుగా పత్తి కొనుగోళ్లు!

మార్కెటింగ్‌శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు వి.శ్రీనివాస్

ఈ ఏడాది పత్తి కొనుగోళ్లకు భారత పత్తి సంస్థ (సీసీఐ) సిద్ధంగా ఉంది.. అందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశాం అని మార్కెటింగ్‌శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు (జేడీఎం) వి.శ్రీనివాస్ తెలిపారు. పత్తి కొనుగోళ్లు ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు ఎదురయ్యే ఇబ్బందులు, మద్దతు ధరపై అవగాహన, ఇతర సమస్యల పరిష్కారానికి గురువారం 'ఈనాడు' నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతులు జేడీఎం శ్రీనివాస్‌కు ఫోన్ చేసి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.


–ఎనుమాముల మార్కెట్, న్యూస్‌టుడే



ఈనాడు ఫోన్ ఇన్

? ఈ ఏడాది అకాల వర్షాలతో పత్తి దిగుబడి తగ్గింది. కొంతమేర మచ్చ వచ్చి రంగు మారింది. పత్తి నాణ్యత దెబ్బతినడంతో పాటు వాతావరణ పరిస్థితుల కారణంగా తేమ శాతం ఎక్కువగా ఉంది. ఇలాంటి పత్తిని సీసీఐ కొనుగోలు చేస్తుందా? **- (శ్రీనివాస్, మరిపెడ, మహబూబాబాద్ జిల్లా), (శివశంకర్, ఆత్మకూరు, హనుమకొండ జిల్లా), (సతీశ్, వెన్నారం, డోర్నకల్), (అన్నా తిరుపతి, ములుగు జిల్లా), (వెంకటేశ్వర్, డోర్నకల్), (తోట రాజేందర్, అబ్బాపూర్, ములుగుజిల్లా)**

✔ నిబంధనల ప్రకారం పత్తిలో 8 నుంచి 12 వరకు తేమ శాతం ఉంటేనే కనీస మద్దతు ధర రూ.7,521కు సీసీఐ కొనుగోలు చేస్తుంది. తేమశాతం సడలింపు, నాణ్యత లేకున్నా కొనుగోలు చేసే అవకాశం లేదు. రైతులు మొత్తం వచ్చిన దిగుబడిలో మంచి పత్తిని, నాణ్యత లేనిది వేరు చేయాలి. నాణ్యమైన పత్తిని సీసీఐకి విక్రయించి మద్దతు ధర పొందొచ్చు. మిగిలినది ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకోవచ్చు. ఉదయం కాకుండా మధ్యాహ్నం పత్తిని ఏరడం ద్వారా తేమశాతాన్ని తగ్గించొచ్చు.



? ప్రైవేటు వ్యాపారులు పత్తిని కొనుగోలు చేసి దాన్ని సీసీఐకి విక్రయిస్తూ.. లబ్ధి పొందుతున్నారు. ఈసారి మిల్లుల్లో ప్రైవేటు వ్యాపారులను నియంత్రిస్తారా? **- (మహేశ్ హాజంపూర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా), (శ్రీనివాస్, ఖిలాషాపూర్, జనగాం జిల్లా)**

✔ ఈ ఏడాది నోటిఫై చేసిన మిల్లుల్లో ప్రైవేటు వ్యాపారులు పత్తి కొనుగోళ్లు జరపకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నాం. ప్రైవేటు వ్యాపారులను ప్రోత్సహిస్తే. సంబంధిత మిల్లు యజమానులపై చర్యలు తీసుకుంటాం. సీసీఐ కాకుండా ఇతర వ్యాపారులు కొనుగోలు చేస్తున్నట్లు రైతులు గుర్తిస్తే.. మిల్లుల్లో సమస్యలపై ఫిర్యాదుల కోసం ఏర్పాటు చేసిన నెంబర్ల ద్వారా సీసీఐ, మార్కెటింగ్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకురావాలి.

? ప్రైవేటు వేబ్రిడ్జిలకు, మిల్లుల్లోని వేబ్రిడ్జిలకు ఒక్కోసారి తూకాల్లో తేడాలు వస్తున్నాయి. దాంతో రైతులు నష్టపోతున్నారు. తూకాల్లో మోసాలను ఎలా అరికడతారు? **- బుస్సారి లక్ష్మణ్, కంచరపల్లి, రఘునాథపల్లి మండలం, జనగామ జిల్లా**

✔ మిల్లుల్లో పంట ఉత్పత్తుల తూకాల్లో ఉద్దేశపూర్వకంగా మోసాలకు పాల్పడితే సంబంధించిన వారిపై చర్యలు తప్పవు. ఎప్పటికప్పుడు తూనికలు కొలతలు అధికారులతో వేబ్రిడ్జిల తనిఖీలు నిర్వహిస్తానే. తూకాల్లో తేడాలొచ్చినట్లు అనుమానం వస్తే.. రైతులు.. తూనికలు, కొలతలు, మార్కెటింగ్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకురావాలి.

తూనికలు, కొలతలు అధికారుల నెంబర్లు

జనగామ - 9440575081

హనుమకొండ, భూపాలపల్లి, ములుగు జిల్లా - 9963311956

వరంగల్ - 9885558028

మహబూబాబాద్ - 9177661663

? పత్తిని మిల్లులకు బస్తాల్లో తీసుకొస్తే.. సీసీఐ కొనుగోలుచేస్తుందా? **- యాకూబ్, కొత్తూరు, ఖానాపురం మండలం, వరంగల్ జిల్లా**

✔ రైతులు పత్తిని మిల్లులకు బస్తాల్లో తీసుకురావొద్దు. విడి పత్తిని మాత్రమే సీసీఐ కొనుగోలు చేస్తుంది. ప్లాస్టిక్, గన్నీ సంచుల్లో తీసుకురావడం వల్ల ఆ బస్తాల్లోని పోగులు పత్తిలో కలిసిపోయి నాణ్యత దెబ్బతినే ప్రమాదముంది. స్పిన్నింగ్ చేసే సమయంలోనూ ఇబ్బందులు తలెత్తుతాయి.

? దళారులు గ్రామాల్లో పత్తిని కొనుగోలు చేస్తూ.. తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నారు. దీన్ని అరికట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? **- బి.సాంబయ్య, నల్లబెల్లి, వరంగల్ జిల్లా**

✔ ఆరుగాలం పండించిన పంటను దళారులకు విక్రయించి రైతులు మోసపోవద్దు. దగ్గరలోని మార్కెట్ కమిటీల్లో.. సీసీఐ నోటిఫై చేసిన మిల్లుల్లో పత్తిని అమ్మడం ద్వారా మార్కెటింగ్‌శాఖ రైతుల సరకుకు జవాబుదారీగా ఉంటుంది. గిట్టుబాటు ధరతో పాటు నిర్ణీత సమయంలో డబ్బులు చెల్లిస్తుంది. తరుగు పేరుతో దళారులు చేసే మోసాలకు మార్కెటింగ్‌శాఖ బాధ్యత వహించదు.

? పత్తి రైతుల కోసం మార్కెటింగ్‌శాఖ ప్రవేశపెట్టిన వాట్సప్ నెంబరులో రైతు వ్యక్తిగత చరవాణి నెంబరు నమోదుచేసినా పండించిన పంట వివరాలు రావడం లేదు? **- రమేశ్, దేవరప్పుల, జనగామ జిల్లా**

✔ ఎన్ఐసీ ఇచ్చిన డేటా ఆధారంగా మార్కెటింగ్‌శాఖ పంట నమోదుచేసిన 21,65,326 మంది రైతులతో వాట్సాప్ నెంబరు (88972 81111)ను రూపొందించింది. ఈ నెంబరు సహాయంతో రైతులు సాగుచేసిన పత్తి వివరాలు, ఎన్ని క్వింటాళ్ల వరకు సీసీఐకు విక్రయించేందుకు అవకాశముంది.. తదితర వివరాలను ముందస్తుగా తెలుసుకోవచ్చు. ఇందులో రైతు వివరాలు రానంత మాత్రాన సీసీఐకు పంట విక్రయించవద్దనే నిబంధన లేదు.

? వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులు పండించిన పంట విస్తీర్ణం కన్నా.. తక్కువ నమోదు చేస్తే. ఏంచేయాలి? **- రవీందర్, తొర్రూర్, మహబూబాబాద్ జిల్లా**

✔ వ్యవసాయ అధికారులు నమోదు చేసిన పంట విస్తీర్ణం ఆధారంగానే సీసీఐ పత్తి కొనుగోలు చేస్తుంది. సీసీఐ నిబంధనల ప్రకారం.. ఆధార్ నెంబరు ప్రామాణికీకరణ, రైతు వేలిముద్రలు, ఓటీపీ ద్వారా ఒక్కో రైతు నుంచి ఎకరానికి 12 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేసే అవకాశముంది. ఒకవేళ వ్యవసాయ విస్తరణాధికారులు సాగు విస్తీర్ణాన్ని తక్కువగా నమోదు చేస్తే.. ఆ రైతులు సంబంధిత ఏఈవోలు ధ్రువీకరించిన పత్రాన్ని సీసీఐ అధికారులకు సమర్పించాలి.

19 నుంచి అంతర్ కళాశాలల క్రీడా పోటీలు

సుబేదారి, న్యూస్‌టుడే: హనుమకొండ సుబేదారి ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో ఈ నెల 19 నుంచి 21 వరకు అంతర్ కళాశాలల క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ ఆచార్య జ్యోతి తెలిపారు. గురువారం కళాశాలలో వివరాలు వెల్లడించారు. కేయూ పరిధిలోని ఉమ్మడి ఖమ్మం, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు 800 మంది హాజరవుతారన్నారు. బ్యాడ్మింటన్‌లో 12, హ్యాండ్‌బాల్‌లో 14, కబడ్డీ 29, ఖోఖోలో 7, సాఫ్ట్‌బాల్‌లో 11 టీములు పాల్గొంటాయన్నారు. ప్రారంభం రోజు నుంచి పోటీలు ముగిసే వరకు మైదానంలో వాకర్స్‌కు అనుమతి లేదన్నారు. వైస్ ప్రిన్సిపల్ రమేష్, పీడీ భాస్కర్, ఆదిరెడ్డి పాల్గొన్నారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	120
రిటైల్:	142
డ్రెస్డ్:	206
స్కిన్‌లెస్:	234

ఇసుక దందాపై స్పందించిన కేటీఆర్



వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇసుక అక్రమ వ్యాపారంపై ఈ నెల 14 'ఇసుక దందా.. వారికి మామూలే' శీర్షికన ఈనాడులో ప్రచురించిన కథనానికి మాజీ మంత్రి, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. ఈనాడులో వచ్చిన కథనాన్ని జత పరుస్తూ.. రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యంలో ఇసుకాసురుల ఇష్టారాజ్యం అంటూ పోస్టు చేశారు. కాంగ్రెస్ పాలనలో ఇసుక మాఫియాకు అభయ హస్తం అంటూ వాగ్బాణాలు సంధించారు.

ఈనాడు కథనానికి స్పందన

ఆర్టీసీ బస్సులు రైట్.. రైట్..



హనుమకొండలోని నయీంనగర్ కొత్త వంతెన మీదుగా ఆర్టీసీ బస్సులు పరుగులు ప్రారంభించాయి. వంతెన నిర్మాణం పనులు పూర్తై, ప్రైవేటు వాహనాలు తిరుగుతున్నా.. ఆర్టీసీ బస్సులు తిరగడం లేదని, ఇతర రూట్లలో తిరగడంతో సమయం వృథా కావడంతో పాటు ప్రయాణికులకు టికెట్‌పై అదనపు భారం తప్పడం లేదంటూ 'ఆర్టీసీ బస్సులకు అనుమతి లేదెందుకు' శీర్షికన గురువారం 'ఈనాడు'లో ప్రచురించిన చిత్ర వార్తకు ఆర్టీసీ, పోలీసు అధికారులు స్పందించారు. వంతెన మీదుగా బస్సులకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో మధ్యాహ్నం నుంచి హనుమకొండ బస్సులను ఈ మార్గంలో పంపించారు. దీంతో కరీంనగర్, హుజూరాబాద్, నిజామాబాద్ వైపు వెళ్లే ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం భానుకిరణ్ మాట్లాడుతూ.. మధ్యాహ్నం ముందుగా బయలు బస్సులకు అదనపు ఛార్జి రూ.10 వసూలు చేశారని, తరవాత బస్సులకు అదనపు ఛార్జి తొలగించామని చెప్పారు. – న్యూస్‌టుడే, హనుమకొండ చౌరస్తా

ఫొటోగ్రఫీ, షార్ట్‌ఫిలిం పోటీలకు ఆహ్వానం

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం (ఫ్లాగ్‌డే) సందర్భంగా విద్యార్థులు, యువతి, యువకులకు జిల్లా, రాష్ట్రస్థాయి ఫొటోగ్రఫీ, షార్ట్‌ఫిలిం పోటీలు నిర్వహించనున్నట్లు వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21 నుంచి 31 వరకు పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. దీనిలో భాగంగా పోలీసుల త్యాగాలు, విధుల్లో ప్రతిభ తెలిపే విధంగా ఈ మధ్య తీసిన మూడు ఫొటోలు, మూడు నిమిషాల నిడివితో తీసిన షార్ట్‌ఫిలిం పెన్‌డ్రైవ్‌ను రాష్ట్రస్థాయి పోటీల కోసం ఈ నెల 22లోపు వరంగల్ పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో పీఆర్వోకు అందించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు, ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, కమ్యూనిటీ పోలీసింగ్, మూఢ నమ్మకాలు, ఇతర సామాజిక రుగ్మతలు, అత్యవసర సమయాల్లో పోలీసుల స్పందన, ప్రకృతి వైపరిత్యాల సమయంలో పోలీసుల సేవ, ఇతర సందర్భాల్లో పోలీసుల కీర్తి ప్రతిష్ఠలు పెంచే అంశాలకు సంబంధించి గతేడాది అక్టోబర్ నుంచి ఇప్పటి వరకు తీసిన ఫొటోలు, షాట్‌ఫిలిం వీడియోలను మాత్రమే పంపించాలన్నారు. పూర్తి వివరాలకు పీఆర్వో సెల్ 87126-85050 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

వనదేవతల కటాక్షం.. మహా జాతర శాశ్వత పనులకు శ్రీకారం!

మేడారం మహాజాతర పనులు ఎప్పుడూ సమయానికి పూర్తి కావు.. జాతరకు ఐదారు నెలల ముందు సమావేశాలు నిర్వహించడం, రెండు నెలల ముందే నిధులు మంజూరు చేయడం, హడావుడిగా పనులు చేపట్టడం జరుగుతుండేది. ఈ ఆనవాయితీకి స్వస్తి పలికేందుకు ప్రభుత్వ యంత్రాంగం సిద్ధమైంది. జాతరతో సంబంధం లేకుండా మేడారంలో చేపట్టాల్సిన శాశ్వత పనులన్నీ పూర్తి చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. –తాడ్వాయి, న్యూస్‌టుడే(ములుగు జిల్లా)



మంత్రి సీతక్క ప్రత్యేక దృష్టి

మేడారం మహాజాతర 2026 ఫిబ్రవరిలో జరిగే అవకాశం ఉంది.. అంటే మరో ఏడాదిన్నర ఉంది.. గత అనుభవాల దృష్ట్యా మహాజాతర ఏర్పాట్లపై మంత్రి సీతక్క ఇప్పుడే ప్రత్యేక దృష్టిసారించారు. గత మే నెలలోనే జిల్లా కేంద్రంలో సమీక్ష సమావేశం నిర్వహించి మేడారం అభివృద్ధికి దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఏయే పనులు ఎప్పుడు చేయాలనే విషయాలపై మార్గనిర్దేశం చేశారు. ఈ నెల 4న మేడారంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

కార్యాచరణ ప్రారంభించిన కలెక్టర్

కలెక్టర్ టీఎస్.దివాకర ఇప్పటికే రెండుసార్లు జాతర ఏర్పాట్లపై శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. చేపట్టాల్సిన పనులను గుర్తించడం, గత జాతరలో ఎదుర్కొన్న ఇబ్బందులపై పూర్తిస్థాయిలో వివిధ శాఖలను అడిగి తెలుసుకొన్నారు. గత జులై 11న మేడారంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

రూ.17.25 కోట్లు మంజూరు


గతంలో జాతర నిర్వహణకు కొద్దిరోజుల ముందే ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుండేది. దీంతో అవి పెద్ద మొత్తంలో దుర్వినియోగం అయ్యేవి. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు ఈసారి అధికారులు ముందుగానే మేల్కొన్నారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు పంపించిన రూ.17.25 కోట్ల ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

ప్రతిపాదనలు.. మంజూరైన నిధులు (రూ.కోట్లలో)

- సీఆర్ఆర్ పథకం ద్వారా కాల్వపల్లి నుంచి ఊరట్టం వరకు రహదారి నిర్మాణం: 8
- మేడారంలోని శివరాంసాగర్ చెరువు నుంచి రిజర్వ్ ఫారెస్టు వరకు రోడ్డు విస్తరణ: 2.75
- ఎమ్మార్ పథకంలో నార్లాపురం చెక్ పోస్టు నుంచి కాల్వపల్లి వరకు తారు దారి: 2.50
- మేడారం అమరవీరుల స్తూపం నుంచి ఊరట్టం వరకు రహదారి నిర్మాణం: 2
- మేడారం అమరవీరుల స్తూపం నుంచి కన్నెపల్లి సారలమ్మ గుడి వరకు దారి: 2

వీటిలో కొన్ని టెండరు పూర్తయ్యాయి.. త్వరలోనే పనులన్నీ ప్రారంభిస్తామని పంచాయతీరాజ్ డీఈఈ ధర్మేందర్‌రావు తెలిపారు.

అతిథిగృహాల నిర్మాణానికి..



80 శాతం పూర్తయిన పూజారుల అతిథిగృహం

శాశ్వత ఏర్పాట్లే లక్ష్యంగా దేవాదాయశాఖ రూ.3.50 కోట్లతో అతిథిగృహాల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. రూ.1.50 కోట్లతో నిర్మిస్తున్న పూజారుల అతిథి గృహం 80 శాతం పూర్తయింది. భక్తులు, అతిథుల కోసం అతిథి గృహం నిర్మించేందుకు ప్రభుత్వం మరో రూ.2 కోట్లు మంజూరు చేసింది. రెండు రోజుల కిందట అధికారులు స్థల పరిశీలన చేశారు. దేవాదాయ శాఖ నిర్మాణాలు మరో ఆరు నెలల్లో పూర్తి చేయిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి రాజేంద్రం తెలిపారు.

19న జాతర పనులకు శంకుస్థాపన

రూ.7.35 కోట్లతో రెండు ప్యాకేజీలుగా చేపట్టే నార్లాపురం చెక్‌పోస్టు-కాల్వపల్లి, ఊరట్టం అమరవీరుల స్తూపం-ఊరట్టం, కన్నెపల్లి ఆర్చిగేటు-సారలమ్మ గుడి, మేడారం ఆర్అండ్‌బీ రోడ్డు-శివరాంసాగర్ చెరువు వరకు రహదారుల నిర్మాణాలకు సంబంధించిన ప్రక్రియ మొత్తం పూర్తయింది. మంత్రి సీతక్క ఈ పనులకు 19న శంకుస్థాపన చేయనున్నారు.

ప్రమాదాలు జరుగుతున్నా పట్టింపులేదు


ఇందిరానగర్ కల్వర్టు వద్ద గుంతలు పడిన రోడ్డు

ఎల్కతుర్తి- ముల్కనూర్ రహదారిపై పలు చోట్ల గుంతలు ప్రమాదకరంగా మారాయి. ఏడాది క్రితం వేసిన రోడ్డు అప్పుడే గుంతలుపడింది. కల్వర్టుల వద్ద ఇరువైపులా కంకర తేలింది. ఎల్కతుర్తి శివారు పెట్రోల్ పంపు సమీపంలో నెల కిందట ద్విచక్రవాహనం అదుపుతప్పి గుంతలో పడటంతో దానిపై వెళ్తున్న మహిళతో పాటు కుమార్తె కాళ్లు విరిగాయి. ఇందిరానగర్ వద్ద పది రోజుల క్రితం మోపెడ్‌పై వెళ్తున్న వ్యక్తి గుంతలో పడి తీవ్రగా గాయపడ్డారు. ఇదే మార్గంలో ప్రజాప్రతినిధులు, అధికారులు తిరుగుతున్నా రోడ్డు నాణ్యతను, గుంతలను పట్టించుకోవడం లేదు. - న్యూస్‌టుడే, ఎల్కతుర్తి

20న ఖోఖో ఎంపిక పోటీలు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఈ నెల 20న ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి ఖోఖో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి శ్యాంప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జూనియర్స్ విభాగంలో బాలబాలికలకు ఎంపిక పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఆదివారం ఉదయం 6 గంటలకు జేఎన్ స్టేడియంలో హాజరుకావాలని కోరారు. ఎంపికైన బాలబాలికలు ఈ నెల 28 నుంచి 30 వరకు మహబూబ్‌నగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. పూర్తి వివరాలకు 98492 10746లో సంప్రదించాలన్నారు.

వాల్మీకి మహర్షి గొప్ప కవి


చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

బాలసముద్రం, న్యూస్‌టుడే : రామాయణ మహా కావ్యాన్ని అందించిన వాల్మీకి మహర్షి గొప్ప కవి అని ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి కొనియాడారు. హనుమకొండ నగరం నక్కలగుట్టలోని విద్యుత్తు భవన్‌లో గురువారం వాల్మీకి మహర్షి జయంతి వేడుక నిర్వహించారు. చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అధికారులు సదర్ లాల్, తిరుపతిరెడ్డి, మధుసూదన్, రాజుచౌహాన్, కిషన్, రవీంద్రనాథ్, కేఎన్.గుట్ట, బికం సింగ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

హనుమకొండ కలెక్టరేట్ : కలెక్టరేట్‌లో వాల్మీకి మహర్షి జయంతిని అధికారికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్ర పటానికి అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. బీసీ సంక్షేమాధికారి రాంరెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, జిల్లా సంక్షేమాధికారిణి జయంతి, ఇతర అధికారులు, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కమలాపూర్ : మండలంలోని వంగపల్లి గ్రామంలో బోయ వాల్మీకి సంఘం నాయకులు వాల్మీకి మహర్షి చిత్ర పటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. నాయకులు పెనుకల సారయ్య, చందర్, నరేందర్, సాంబయ్య, ఓదెలు, రవీందర్, రమేశ్ పాల్గొన్నారు.

నడికూడ, న్యూస్‌టుడే: మహర్షి వాల్మీకి జయంతిని నడికూడ మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. నార్లాపూర్ గ్రామంలో బండ వాసు అధ్యక్షతన నిర్వహించారు. చిత్రపటానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో సుధాకర్, శ్రీనివాస్, నాగరాజు, రాంప్రసాద్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్‌లో చిత్ర పటానికి నమస్కరిస్తున్న అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి


వంగపల్లిలో బోయ వాల్మీకి సంఘం నాయకులు


నడికూడ మండలం నార్లాపూర్‌లో..

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM)
జులైవాడ 9059585150
ఎక్సైజ్‌కాలనీ 9866607449
పరకాల 9849211303

సుబేదారి, న్యూస్‌టుడే: నగరంలోని నక్కలగుట్టలోని ప్రధాన కాలువలో వ్యర్థాలు చేరి దుర్వాసన వస్తోంది. దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. శుభ్రం చేయించాలి. - విజయ్, నక్కలగుట్ట

సమాధానం: పరిశీలించి శుభ్రం చేయిస్తాం. - శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

దామెర, న్యూస్‌టుడే: సమస్య: మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం సమీపంలో పక్కనే ఉన్న మురుగు కాలువ వ్యర్థాలతో నిండి దుర్వాసన వస్తుంది. - రమేష్, స్థానికుడు

సమాధానం: పంచాయతీ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లి కాల్వ వ్యర్థాలను తొలగిస్తాం. - మనోహర్, కార్యదర్శి

పరకాల, న్యూస్‌టుడే: పట్టణంలో జయ టీచర్స్ రోడ్డు మార్గంలో చెత్త చెదారం పేరుకపోయి అపరిశుభ్రంగా కనపడుతుంది. - కుమార్, స్థానికుడు

సమాధానం: సిబ్బందిని పంపి శుభ్రం చేయిస్తాం. - నర్సింహ, పుర కమిషనర్

చెత్త కుప్పలు తొలగింపు..

స్పందనకు వందనం

హనుమకొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే : నగరంలోని 8వ డివిజన్ రెడ్డికాలనీ పాలజెంద వద్ద రోడ్డు పక్కన చెత్త కుప్పలు పేరుకుపోయి, దుర్వాసన వస్తోందని కాలనీకి చెందిన కిరణ్ 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలిపారు. సమస్యను నగరపాలక సంస్థ శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనిల్ దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన స్పందించి చెత్త కుప్పలను ఎత్తేయించారు.

మురుగు కాలువలు శుభ్రం

హనుమకొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే : నగరంలోని 30వ డివిజన్ బాలసముద్రం శ్రీనగర్‌కాలనీలో మురుగు కాలువలు శుభ్రం చేయడం లేదని కాలనీకి చెందిన రవీందర్ 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలిపారు, సమస్యను నగరపాలక సంస్థ అధికారులకు తెలపడంతో స్పందించి, మురుగు కాలువలను శుభ్రం చేయించి సమస్యను పరిష్కరించారు.

21న నిరసన దీక్షకు తరలిరండి

ఎర్రగట్టు క్యాంపు (భీమారం), న్యూస్‌టుడే: పంబాల కుల వృత్తి కళాకారుల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 21న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద నిర్వహించనున్న నిరసన దీక్షకు పంబాల కులస్థులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు గడ్డం భార్గవ్ పిలుపునిచ్చారు. హసన్‌పర్తి మండలం భీమారంలోని ఎర్రగట్టుగుట్ట ఆలయ ప్రాంగణంలో గురువారం జరిగిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత జనాభా లెక్కల ప్రకారమే ఎస్సీ వర్గీకరణ చేయాలని కోరారు. సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు భూపాల్‌రాజు, ప్రధాన కార్యదర్శి పండు, కోశాధికారి శ్రీనివాస్, కార్యదర్శి రాజయ్య, ప్రచార కార్యదర్శి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి సంఘాల ధర్నా



హనుమకొండ చౌరస్తా, న్యూస్‌టుడే : పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం కాకతీయ డిగ్రీ కళాశాల నుంచి అశోకా కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. కూడలిలో రాస్తారోకో చేశారు. పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి బాషబోయిన సంతోష్, వరంగల్ జిల్లా కార్యదర్శి మిశ్రీన్ సుల్తానా, యూఎస్ ఎఫ్ఐ నాయకులు రాజేస్, ఏఐఎస్‌బీ నాయకులు సతీష్, వివిధ సంఘాల నాయకులు రంజిత్, ప్రణిత, అర్జున్, చరణ్, ముషారఫ్, డానియల్, అనూష, నిఖిల తదితరులు పాల్గొన్నారు.

ఇండస్ట్రీ అవసరాలకు అనుగుణంగా పాఠ్యాంశాలు


కార్యక్రమంలో ప్రసంగిస్తున్న రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి

విద్యానగర్, న్యూస్‌టుడే: ఇండస్ట్రీ అవసరాలకు అనుగుణంగా పాఠ్యాంశాలు ఉండాలని కాకతీయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి అన్నారు. సవరించి ఎంకామ్, ఎంబీఏ సిలబస్‌పై వర్సిటీ కామర్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య పి.అమరవేణి అధ్యక్షతన గురువారం కళాశాల సెమినార్ హాల్‌లో అవగాహన సదస్సు జరిగింది. రిజిస్ట్రార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సిలబస్ బోధనలో బహుముఖ వ్యూహాలను అనుసరించాలని అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం



టీచర్స్‌కాలనీ, న్యూస్‌టుడే: టీచర్స్‌కాలనీలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో 25వ బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం స్వామి వారి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. టీచర్స్‌కాలనీ, ఎస్బీహెచ్ కాలనీలకు చెందిన మహిళలు స్వామి వారిని మంగళహారతులతో స్వాగతించారు. అనంతరం కోలాటం ఆడారు. ఆలయ కమిటీ ఛైర్మన్ రఘుపతిరెడ్డి, పండితులు శఠగోపాచార్యులు, పూజారి కలకోట వెంకటరమణ, నిర్వాహకులు చంద్రమౌళి, బి.రవీందర్, కుమారస్వామి, రామచంద్రారెడ్డి, జితేందర్‌రెడ్డి, స్వరూపరాణి, టీవీ శేషగిరి, నరహరి, పార్వతి, వకుళ, వసంత పాల్గొన్నారు.

ఫ్రీ రిపబ్లిక్‌డే పరేడ్‌కు వాలంటీర్ల ఎంపిక


ఎంపిక పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

విద్యానగర్, న్యూస్‌టుడే: వచ్చే నెల 12 నుంచి 21 వరకు మహారాష్ట్రలోని జలగం విశ్వవిద్యాలయంలో నిర్వహించే సౌత్‌జోన్ ఫ్రీ రిపబ్లిక్‌డే పరేడ్ శిబిరానికి గురువారం కేయూలో వాలంటీర్లను ఎంపిక చేసినట్లు విశ్వవిద్యాలయ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఈసం నారాయణ తెలిపారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ నుంచి డిగ్రీ, పీజీ విద్యార్థులు 200మంది పాల్గొనగా.. ముగ్గురు అమ్మాయిలు, ముగ్గురు అబ్బాయిలను ఎంపిక చేసినట్లు చెప్పారు.

ముగిసిన క్రికెట్ జట్ల ఎంపిక పోటీలు


ఎంపికైన క్రికెటర్లతో సంఘం ప్రతినిధులు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: వరంగల్ క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న జిల్లాస్థాయి ఎంపిక పోటీలు గురువారం ముగిశాయి. వరంగల్ దేశాయిపేటలోని సీకేఎం కళాశాల మైదానంలో రెండు రోజులు నిర్వహించిన ఎంపిక పోటీలకు వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లి జిల్లాలకు చెందిన అండర్-23 క్రికెటర్లు హాజరయ్యారు. జిల్లాల వారీగా బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాల్లో నైపుణ్యాలు పరీక్షించారు. ఒక్కో జిల్లా నుంచి 18 మంది ఆటగాళ్లను ఎంపిక చేసినట్లు వరంగల్ క్రికెట్ సంఘం కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు. ఆరు జిల్లాల నుంచి 108 మంది క్రికెటర్లను ఎంపిక చేశామన్నారు. ఇందులో నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టు ఎంపిక కోసం ఈ నెల 20 నుంచి 23 వరకు పోటీలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వరంగల్ క్రికెట్ సంఘం ప్రతినిధులు మట్టెడ కుమార్, వినయ్, ఉపేందర్ పాల్గొన్నారు.

చదరంగం పోటీల గోడప్రతులు ఆవిష్కరణ

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి చదరంగం పోటీల ప్రచార గోడప్రతులను మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య ఆవిష్కరించారు. గురువారం మట్టెవాడలోని ఆయన నివాసంలో వరంగల్ జిల్లా చదరంగం సంఘం ప్రతినిధులతో కలిసి ఆయన మాట్లాడారు. ఓరుగల్లు బిడ్డ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ స్ఫూర్తితో చదరంగం క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. ఈ నెల 22, 23 తేదీల్లో అండర్-15 విభాగంలో బాలబాలికలకు హనుమకొండలోని తిరుమల తిరుపతి దేవస్థానం వేడుకల మందిరంలో పోటీలు ఉంటాయని కార్యనిర్వహణ ప్రతినిధి కన్నా తెలిపారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబరు 90595 22986లో సంప్రదించాలన్నారు. వరంగల్ చదరంగం సంఘం ప్రతినిధులు శ్రీనివాస్, ప్రేమ్ సాగర్, మాజీ కార్పొరేటర్ లక్ష్మణ్, రవి పాల్గొన్నారు.

నేడు కిట్స్‌లో సంశోధిని-24 ఫెస్ట్

భీమారం, న్యూస్‌టుడే: హసన్‌పర్తి మండలం భీమారంలోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ (సాక్) ఆధ్వర్యంలో ఈ నెల 18, 19వ తేదీల్లో రెండు రోజుల పాటు జాతీయ స్థాయి విద్యార్థి సాంకేతిక సింపోజియం (సంశోధిని-2024-ఫెస్ట్) వేడుకలను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.అశోక్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంజినీరింగ్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

బాధిత కుటుంబాలకు మాజీ మంత్రి ఎర్రబెల్లి పరామర్శ

భీమారం, న్యూస్‌టుడే: ఇటీవల హసన్‌పర్తి మండలం భీమారం ప్రాంతానికి చెందిన ప్రాతికేయుడు ఎన్.సుభాష్ గుండెపోటుతో మృతి చెందడంతో కుటుంబ సభ్యులను గురువారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరామర్శించారు. సుభాష్ చిత్ర పటానికి పూలమాల వేసి సంతాపం ప్రకటించారు. వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, భారాస నాయకులు అటికం రవీందర్, బండి రజినీకుమార్, వీరేశం, లక్ష్మణ్ యాదవ్ పాల్గొన్నారు.

ఐనవోలు : నందనం కర్షక సేవా సహకార సంఘం వైస్ ఛైర్మన్ చందర్‌రావు కోడలు శ్వేత (35) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, టెస్కాబ్ ఛైర్మన్ మార్నేని రవీందర్‌రావులు వేర్వేరుగా ఆయన్ను పరామర్శించారు. కాంగ్రెస్, భాజపా, భారాస నాయకులు ఉన్నారు.

సంక్షిప్తంగా

క్రీడా పోటీలను విజయవంతం చేయాలి

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్ఐ) క్రీడా పోటీలను విజయవంతం చేయాలని హనుమకొండ జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి అధికారి, అండర్-19 ఎస్‌జీఎఫ్ కార్యదర్శి అశోక్‌కుమార్ తెలిపారు. గురువారం హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో పోటీల నిర్వహణపై పీడీలు, కోచ్‌లతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అశోక్‌కుమార్ మాట్లాడారు. తొలి విడతలో ఈ నెల 25, 26న, రెండో విడతలో 28, 29 తేదీల్లో క్రీడా పోటీలు ఉంటాయన్నారు. అండర్-19 క్రీడాకారులు ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ పత్రంతో హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులు గోపాల్, శ్రీధర్, సంగెం ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ మాధవరావు, పీడీలు, పీఈటీలు, కోచ్‌లు పాల్గొన్నారు.

పింఛనుదారులకు బకాయిలు చెల్లించాలి

ఎన్జీవోస్‌కాలనీ, న్యూస్‌టుడే: ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగ, ఉపాధ్యాయ పింఛనుదారులకు వెంటనే బకాయిలు చెల్లించాలని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి తిరువరంగం ప్రభాకర్ డిమాండ్ చేశారు. గురువారం హనుమకొండలోని జిల్లా కార్యాలయంలో మల్లారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈహెచ్‌సీ, పీఆర్‌సీ విషయంలో ప్రభుత్వం ఉదాసీన వైఖరిని ప్రదర్శిస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్‌రెడ్డి, సత్యనారాయణ, సంజీవరెడ్డి, చారి, కొమురయ్య, జగదీశ్వర్‌రెడ్డి, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ సాధనకు గ్రంథాలయం తోడ్పాటు

నయింనగర్, న్యూస్‌టుడే: డీఎస్సీ-2024లో ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన పలువురికి గ్రంథాలయం ఎంతో తోడ్పడిందని సంస్థ కార్యదర్శి శశిజాదేవి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రంథాలయంలో సన్నద్ధమై వారిలో 44 మంది ఉపాధ్యాయులుగా ఎంపికైనట్లు తెలిపారు. వారికి త్వరలో సత్కరించనున్నట్లు పేర్కొన్నారు. గతంలోనూ వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమై 182 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. నిరుద్యోగ యువత పోటీ పరీక్షలకు సన్నద్ధం కావడానికి అన్ని వసతులతో పాటు పుస్తకాలు సమకూరుస్తున్నామని అన్నారు.

ఆదివాసీల ఆత్మబంధువు కుమురం భీం

విద్యానగర్, న్యూస్‌టుడే: తెలంగాణ విముక్తి కోసం పోరాడిన యోధుడు కుమురం భీం ఆదివాసీల ఆత్మబంధువని పులే ఆశయ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు సంగని మల్లేశ్వర్ అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగంలో గురువారం కుమురం భీం వర్ధంతి నిర్వహించారు. చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. నాయకులు శ్రీనివాస్, సుధాకర్, భాస్కర్, బిక్కునాయక్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

వేలేరు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో ఇంటర్ చదువుకున్న బాలిక (17) అదృశ్యంపై కేసు నమోదు అయింది. ఈ నెల 14న కుటుంబ సభ్యులు పొలం పనులకు వెళ్లి సాయంత్రం వచ్చేసరికి బాలిక కనిపించలేదు. ఎక్కడా ఆచూకీ లభించక పోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మెస్ ఛార్జీలు తగ్గించాలని ధర్నా



విద్యానగర్, న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లోని పీజీ రెండో సంవత్సరం విద్యార్థులు మెస్ ఛార్జీలు తగ్గించాలని కోరుతూ విశ్వవిద్యాలయం హాస్టల్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా చేశారు. హాస్టల్ డైరెక్టర్ ఎల్.పి.రాజ్‌కుమార్ ఎదుట నినాదాలు చేశారు. కేయూ ఠాణా ఎస్ఐలు రవీందర్, ప్రవీణ్‌లు అక్కడికి చేరుకొని విద్యార్థులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసారు. రెన్యూవల్ ఛార్జీలు రూ.2500 నుంచి రూ.1000కి తగ్గించడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.

మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లు సీజ్

మడికొండ, న్యూస్‌టుడే: అక్రమంగా మట్టి తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను, ప్రొక్లెయిన్‌ను మడికొండ పోలీసులు సీజ్ చేశారు. ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ కథనం ప్రకారం.. మడికొండకు చెందిన రాపోలు విజయ్, దండ్ల ప్రసాద్, దారంగుల రాజు, ఎత్తరి కల్యాణ్, పల్లపు నాగరాజు మడికొండ శివారులోని ఇందిరమ్మ కాలనీలో యంత్రాలు పెట్టి నాలుగు ట్రాక్టర్లలో మట్టిని తరలిస్తుండగా దాడులు చేసి పట్టుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోండి

వరంగల్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెండెం రాజు అన్నారు. గురువారం హనుమకొండలోని ప్రభుత్వ మర్కజీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. 2019 నుంచి 2024 వరకు మూడు సంవత్సరాల ఉన్నత తరగతుల బోధన అనుభవం ఉన్న ఉపాధ్యాయులు అందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తెలిపారు. యూటీఎఫ్ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు డి.కిరణ్‌కుమార్, కె.మోజెస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పని చేసిన వారికే ప్రాధాన్యం ఇవ్వాలి

వేలేరు, న్యూస్‌టుడే: మొదటి నుంచి పార్టీ కోసం పని చేసిన వారికే ఎమ్మెల్యే ప్రాధాన్యం ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీలోని ఓ వర్గం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం వేలేరులో జరిగిన విలేకర్ల సమావేశంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు జోడుముంతల సంపత్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సద్దాం హుసేన్, సీనియర్ నాయకులు మల్కిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కీర్తి వెంకటేశ్వర్లు మాట్లాడారు. పార్టీ అధికారంలో లేనప్పుడు జెండాను మోసి, పార్టీని కాపాడిన వారికి గుర్తింపు ఇవ్వాలన్నారు. సీనియర్ నాయకులు, కార్యకర్తలకు ఏమాత్రం సమాచారం లేకుండా వేసిన ఇందిరమ్మ ఇళ్ల కమిటీని రద్దు చేయాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో సీనియర్లకు అవకాశం ఇవ్వాలని అన్నారు.

గోపాలపూర్ ఉచిత వైద్య శిబిరం

గోపాలపూర్, న్యూస్‌టుడే: హనుమకొండలోని 56వ డివిజన్ గోపాలపూర్ దేవరాజ్‌కాలనీలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రోగులను పరీక్షించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్పొరేటర్ సిరంగి సునీల్‌కుమార్, టీపీసీసీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కందుకూరి పూర్ణచందర్, అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు సంఘటితమై పోరాడాలి

భీమదేవరపల్లి, న్యూస్‌టుడే: మహిళలు పనిచేసే చోట లైంగిక వైధింపులు, గృహ హింసలపై సంఘటితమై పోరాటం చేయాలని సఖి కేంద్రం సమన్వయకర్త హరిత అన్నారు. గురువారం భీమదేవరపల్లి మండలం కొత్తపల్లిలో స్వశక్తి సంఘాల మహిళలకు సర్వోదయ యూత్, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. సఖి కేంద్రం మహిళల కోసం 24గంటలు పని చేస్తుందన్నారు. ఏదైనా సమస్య వచ్చినప్పుడు 181 నెంబరుకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమావేశంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీల, వినీల, ఐకేపి మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కారు ఫ్యాన్సీ నెంబర్‌కు రూ.2.57 లక్షలు

చింతగట్టు క్యాంపు (భీమారం), న్యూస్‌టుడే: రవాణా శాఖ (ఆర్టీఏ) రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే ఫ్యాన్సీ బిడ్డింగ్ నెంబర్లకు రోజు రోజుకు క్రేజీ పెరుగుతోంది. హసన్‌పర్తి మండలం చింతగట్టు క్యాంపులోని హనుమకొండ జిల్లా రవాణా శాఖ అధికారులు గురువారం నిర్వహించిన ఆన్‌లైన్ బిడ్డింగ్‌లో టీజీ 03-ఏ 0009 నెంబర్‌ను హనుమకొండకు చెందిన నవ నిర్మాణ అసోసియేట్స్ సంస్థ నిర్వాహకులు రూ.2.57 లక్షలకు బిడ్డింగ్ చేసి కైవసం చేసుకున్నట్లు జిల్లా అధికారి వేణుగోపాల్ తెలిపారు. అలాగే టీజీ03-ఏ 0001 నెంబర్‌ను హనుమకొండకు చెందిన స్థిరాస్తి వ్యాపార సంస్థ నిర్వాహకుడు రూ.1.30 లక్షలకు, టీజీ 03-ఏ 0006 నెంబరును ఓ మహిళ రూ.56 వేలకు దక్కించుకున్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత


బియ్యం స్వాధీనం చేసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు అందించాల్సిన రాయితీ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచిన కేంద్రాలపై గురువారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. 51.81 క్వింటాళ్ల బియ్యం, 72 క్వింటాళ్ల నూకలు స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.మధుసూదన్ తెలిపారు. వాటి విలువ రూ.3.21 లక్షలు ఉంటుందన్నారు. ఆయన కథనం ప్రకారం.. ఐనవోలు మండలం పంథిని గ్రామ శివారులో ఎం.ధనుంజయ్‌కు చెందిన శారద పౌల్ట్రీలో 12.43 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం, 72 క్వింటాళ్ల నూకలు, జి.కరుణాకర్‌కు చెందిన అభిరాంసాయి పౌల్ట్రీలో 22.88 క్వింటాళ్లు, ఆత్మకూర్ మండలం కామారంలో టి.చిరంజీవి ఇంట్లో 11 క్వింటాళ్లు, ఇంతేజార్‌గంజ్ ఠాణా పరిధి కాశిబుగ్గలోని కృష్ణమూర్తి, జి.పవన్ ఇళ్లలో 5.5 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకొన్నామన్నారు. కేసు నమోదు, విచారణ కోసం ఆయా ఠాణాలకు అప్పగించామని తెలిపారు.

చోరీ కేసులో నలుగురి అరెస్టు

కమలాపూర్, న్యూస్‌టుడే: వృద్ధురాలి మెడలో నుంచి పుస్తెలతాడు చోరీ చేసిన ఇద్దరిని, వారికి సహకరించిన మరో ఇద్దరిని గురువారం అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు కమలాపూర్ సీఐ ఎల్కటూరి హరికృష్ణ తెలిపారు. ఆయన కథన మేరకు.. కమలాపూర్ బస్టాండు కూడలిలోని కిరాణ దుకాణం పక్కన పెంకుటింట్లో నివసిస్తున్న వృద్ధురాలు జులై 22 అర్ధరాత్రి మూత్ర విసర్జనకు లేచారు. ఇంట్లో నుంచి బయటకు వస్తున్న ఆమె మెడలో నుంచి మూడు తులాల పుస్తెల తాడును మాటేటి రమేశ్ తెంపుకెళ్లాడు. బాధిరాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. చోరీ సమయంలో మాటేటి రమేశ్‌కు మొగిలిచెర్ల ప్రశాంత్ అనే వ్యక్తి సహకరించినట్లు పోలీసులు గుర్తించారు. పల్లెపు లక్ష్మీనారాయణ అనే వ్యక్తి ఆ పుస్తెల తాడును అమ్మిస్తానని చెప్పి తీసుకెళ్లి వెనిశెట్టి పున్నం చందర్ దగ్గర రూ.1.60 లక్షలకు కుదువపెట్టారు. గురువారం ఉదయం గూడూరు క్రాస్ రోడ్డు వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఈ నలుగురిని పెట్రోలింగ్ పోలీసులు అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. నిందితుల నుంచి రూ.20 వేల నగదు, పుస్తెల తాడు కరిగించిన మూడు తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడైన మాటేటి రమేశ్ పాత నేరస్థుడని సీఐ తెలిపారు.

భార్య కాపురానికి రావడం లేదని యువకుడి ఆత్మహత్య


శ్రీకాంత్ (పాతచిత్రం)

ఐనవోలు, న్యూస్‌టుడే: భార్య కాపురానికి రావడంలేదని మనస్తాపానికి గురై యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వనమాలకనపర్తి గ్రామానికి చెందిన కొట్టె శ్రీకాంత్ (30) భార్య పది నెలలుగా కాపురానికి రావడంలేదు. ఎంతగా ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో ఈ నెల 14న పురుగుల మందు తాగాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ.. బుధవారం అర్ధరాత్రి మృతి చెందాడు. యువకుడి తండ్రి దేవయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పరకాల నియోజకవర్గం

బోధన రుసుం బకాయిలు చెల్లించాల్సిందే


కళాశాల ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

దామెర, న్యూస్‌టుడే: బోధన రుసుం, ఉపకార వేతనాల బకాయిలు వెంటనే విడుదల చేయాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. తెలంగాణ ఫార్మసీ కళాశాల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ పిలుపుమేరకు గురువారం మండలంలోని ఒగ్లాపూర్‌లోని కేర్ ఫార్మసీ కళాశాల యాజమాన్యం గేటుకు తాళం వేసింది. విద్యార్థులు, అధ్యాపకులు కళాశాల ఎదుట ఆందోళన చేశారు. మూడేళ్ల నుంచి ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోతే మా చదువులు ఎట్లా సాగుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం బకాయిలు చెల్లించే వరకు నిరసన కొనసాగిస్తామని కళాశాల యాజమాన్యం తెలిపారు.

మార్కెట్‌లోనే పత్తి కొనుగోళ్లు చేపట్టాలి

పరకాల: మిల్లుల్లో కాకుండా పరకాల వ్యవసాయ మార్కెట్‌లోనే పత్తి కొనుగోళ్లు జరిగేలా చూడాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ హమాలీ యూనియన్ డివిజన్ అధ్యక్షుడు అశోక్, గౌరవ అధ్యక్షుడు రాములు కోరారు. ఈ మేరకు గురువారం మార్కెట్ కమిటీ ఛైర్మన్‌కు వినతిపత్రం అందజేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. మార్కెట్‌పై 165 మంది హమాలీలు, 22 మంది దడవాయిలు, 15 మంది గంప కూలీలు ఆధారపడి జీవిస్తున్నారని పేర్కొన్నారు. నాయకులు శంకర్, రాజయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు తప్పనిసరి

దామెర, న్యూస్‌టుడే: గ్రామాల్లోని పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేయించాలని మండల పశు వైద్యాధికారి డా.దీపిక అన్నారు. గురువారం మండల కేంద్రంలో వైద్యశిబిరం నిర్వహించారు. టీకాలతో పాల ఉత్పత్తి, పునరుత్పత్తి శక్తి పెరుగుతుందని తెలిపారు. మండల వ్యాప్తంగా ప్రతి గ్రామంలో పశువైద్య శిబిరాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వీఎల్‌వో లక్ష్మణ్, జేవీవో సారంగం, ఎల్ఎస్ఏ సిరాజుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు రుణాలు ఇవ్వండి

శాయంపేట, న్యూస్‌టుడే: మండలంలోని మైలారం గ్రామంలో ఎస్సీ కార్పొరేషన్ పథకంలో ఎంపిక చేసిన 72 మంది లబ్ధిదారులకు రుణాలు అందించాలని గురువారం మాజీ సర్పంచి ప్రసాద్, ఎంపీటీసీ మాజీ సభ్యులు విజయ కోరారు. కాంగ్రెస్ నేతలు 24 మంది పేర్లను అధికారులపై ఒత్తిడి తీసుకుని వచ్చి తొలగించినట్లు పేర్కొన్నారు. అర్హులకు న్యాయం చేయాలని కోరారు.